క్లుప్తంగా

ఆధార్ కేంద్రం ప్రారంభం



ఆత్మకూరు: మున్సిపల్ కార్యాలయంలోని ఇరిగేషన్ సచివాలయంలో ఆధార్ కేంద్రాన్ని కమిషనర్ సీ గంగాప్రసాద్ సోమవారం ప్రారంభించారు. గత కొన్ని నెలలుగా పట్టణంలో ఆధార్ నమోదు కేంద్రం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ఆధార్ కేంద్రాన్ని ప్రారంభించామని, ఇక నుంచి ఆధార్ సేవల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరంలేదని కమిషనర్ తెలిపారు. త్వరలోనే ఎంపీడీఓ కార్యాలయంలోనూ మరో ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామన్నారు.

డ్రైవర్ల పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

ఉదయగిరి: స్థానిక ఆర్టీసీ డిపోలో ఆన్‌కాల్ డ్రైవర్లుగా పనిచేసేందుకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఇన్‌చార్జి డిపో మేనేజర్ శివకేశవయాదవ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏడాదిన్నర కాలం హెవీ వెహికల్ లైసెన్స్, 39 ఏళ్లలోపు వయస్సు కలిగిన వారు అర్హులని చెప్పారు. అర్హులైన వారు దరఖాస్తుతో పాటు విద్యార్హత సర్టిఫికెట్, హెవీ లైసెన్స్, ఆధార్ కార్డు నకళ్లను డిపో మేనేజర్ కార్యాలయంలో అందజేయాలని కోరారు.

యోగాతో మానసిక ప్రశాంతత



ఉదయగిరి: యోగాతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని ఎంఈఓ–1 టీ వెంకటేశ్వర్లు అన్నారు. పట్టణంలోని నార్త్ పాఠశాలను సోమవారం ఆయన తనిఖీ చేశారు. విద్యార్థులతో ప్రార్థనానంతరం యోగా చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ప్రతిరోజూ యోగా సాధన చేయడం వల్ల మానసిక, శారీరక ఆరోగ్యం మెరుగుపడుతుందన్నారు. విద్యార్థులతో ప్రతిరోజూ యోగా సాధన చేయించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రతిరోజూ విద్యార్థులు యూనిఫామ్, బూట్లు ధరించి పాఠశాల సమయానికి హాజరుకావాలన్నారు. అనంతరం విద్యార్థుల అభ్యసన, పఠనా సామర్థ్యాలను పరిశీలించారు. హెచ్‌ఎం కే వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

జలదంకి: ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని వింజమూరు ఏడీఏ శేషగిరి హెచ్చరించారు. సోమవారం ఆయన ఏఓ శ్రీవాణితో కలిసి మండలంలోని ఎరువుల డీలర్లతో వ్యవసాయశాఖ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. యూరియాతో పాటు ఇతర ఎరువులను ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే విక్రయించాలని సూచించారు. ఇటీవల మండలంలో ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తున్నారని రైతుల నుంచి ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. ఇకపై అలాంటి ఫిర్యాదులు వస్తే సహించేది లేదన్నారు. లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు. ఇకపై రైతులకు బిల్లులు తప్పనిసరిగా అందజేయాలన్నారు. రైతులు సైతం బిల్లులు తీసుకోవాలని సూచించారు.

అద్దె బస్సులను కండీషన్‌లో ఉంచాలి



ఆత్మకూరురూరల్: అద్దె బస్సులను కండీషన్‌లో ఉంచాలని ఆత్మకూరు డిపో మేనేజర్ శివకేశ్‌యాదవ్ అద్దె బస్సుల యజమానులకు సూచించారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో అద్దె బస్సుల యజమానులతో సమావేశం నిర్వహించారు. బస్సులను పరిశుభ్రంగా ఉంచాలని, సస్పెన్షన్ సిస్టమ్, ఫుట్‌బోర్డులు పటిష్టంగా ఉంచాలని, బస్సు టైర్లను ఎప్పటికప్పుడు మారుస్తుండాలని, ప్రతి బస్సుకు ముగ్గురు డ్రైవర్లను అందుబాటులో ఉంచాలని సూచించారు. కాగా ఆత్మకూరు డిపోలో ఆన్‌కాల్ డ్రైవర్లను తీసుకుంటున్నామని, హెవీ వెహికల్ లైసెన్స్ కలిగిన 35 ఏళ్లలోపు వయస్సు ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అసిస్టెంట్ డిపో మేనేజర్ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

నేడు బీజేపీ సమావేశం

ఆత్మకూరు: పట్టణంలోని త్రికోటేశ్వర కల్యాణ మండపంలో ఆత్మకూరు నియోజకవర్గస్థాయి బీజేపీ సమావేశాన్ని మంగళవారం ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ నాయకులు సోమవారం తెలిపారు. నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాల అమలుతో పాటు పార్టీ పరమైన అంశాలపై సమీక్షించనున్నట్లు చెప్పారు. అన్ని మండలాల పార్టీ బాధ్యులు హాజరుకావాలని కోరారు.

చారిత్రక నిలయం.. అలఘునాథుని ఆలయం

- చోళుల హయాంలో నిర్మాణం
- క్రమంగా శిథిలావస్థకు చేరిన ఆలయం
- వందేళ్లపాటు ధూపదీప నైవేద్యాలకు నోచుకోని స్వామి
- 12 ఏళ్ల క్రితం ఆలయ పునర్నిర్మాణం
- నేటి నుంచి పుష్కర కుంభాభిషేక మహోత్సవాలు



శ్రీదేవిభూదేవి సమేత అలఘునాథ స్వామి ఆలయం



శ్రీదేవి, భూదేవి సమేత అలఘునాథస్వామి

ఆత్మకూరు: పట్టణంలోని తూర్పువీధిలోని చారిత్రిక శ్రీదేవి, భూదేవి సమేత అలఘునాథ స్వామి ఆలయం పుష్కర కుంభాభిషేక మహోత్సవానికి ముస్తాబైంది. మంగళవారం నుంచి మూడు రోజుల పాటు ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నారు.

చోళుల కాలంలో నిర్మాణం

పురాతనమైన అలఘునాథుని ఆలయాన్ని చోళుల కాలంలో నిర్మించినట్లుగా శాసనాలు చెబుతున్నాయి. ఆత్మకూరు ప్రాంతం 8వ శతాబ్దంలో బోయరాజుల పాలనలో ఉండేది. అనంతరం పల్లవరాజులు, ఆ తరువాత చోళ రాజులు పరిపాలించారు. చోళుల వంశానికి చెందిన మూడో కులోత్తుంగ చక్రవర్తికి సామంత రాజైన తిరుకాల తిరుదేవ మహారాజు క్రీస్తు శకం 1209 నుంచి 1248 వరకు కంచిని రాజధానిగా చేసుకుని పరిపాలన సాగించారు. ఆయన తన కుమారుడు మనుమసిద్ధి మహారాజుకు నెల్లూరు ప్రాంతాన్ని , అల్లుడు అల్లు తిరుక్కాల దేవరాజుకు కంచి ప్రాంతాన్ని అప్పగించారు. తిరుక్కాల దేవరాజు ఆత్మకూరు ప్రాంత పర్యటనకు వచ్చిన సమయంలో తూర్పుప్రాంతంలో క్రీస్తు శకం 1247 పరాభవ నామ సంవత్సరం భాద్రపద మాసంలో శ్రీదేవి, భూదేవి సమేత అలఘునాథ స్వామి ఆలయాన్ని నిర్మించినట్లుగా శాసనాలు చెబుతున్నాయి. ఆలయ నిర్మాణంలో భాగంగా మూడు అంతస్తుల విమాన గోపురం, అర్థ, ఊయల, నాలుగు స్తంభాల అంతర్, 12 స్తంభాల ముఖ మండపాలను అద్భుత శిల్ప కళారీతిలో నిర్మించారు. అనంతర కాలంలో కాకతీయ చక్రవర్తులు, కళింగ గజపతులు, విజయనగరరాజులు ఆత్మకూరు ప్రాంతాన్ని పాలించే క్రమంలో ఆలయానికి 101 ఎకరాల మాన్యాన్ని విరాళంగా అందజేశారని శాసనాల ద్వారా తెలుస్తోంది. క్రీస్తు 1549లో కోనేటి తిమ్మరాజయ్య (వెలిదండ తిమ్మరసు) కాలంలో అలఘునాథ స్వామి ఆలయం వద్ద విడిది చేసే సైన్యాలు యుద్ధాలు లేని సమయంలో ఆలయం ఎదురుగా పడమర వైపు రాజమార్గాన్ని (తిప్పమీదుగా) నిర్మించి ఆత్మకూరు గ్రామానికి ఉపయోగపడేలా పెద్ద చెరువును తవ్వించినట్లుగా శాసనాల్లో పేర్కొని ఉన్నారు. ఆయన కాలంలోనే అలఘునాథ స్వామి ఆలయంలో దక్షిణంవైపున ప్రతిష్ఠించిన భారీ ఆంజనేయస్వామి విగ్రహం నేటికి ఉంది. ఇంతటి ఘన చరిత్ర, శిల్ప సంపద కలిగిన అలఘునాథ స్వామి ఆలయం కాలక్రమేణా శిథిలావస్థకు చేరుకుంది. సుమారు వందేళ్ల క్రితం వరకు బ్రిటీష్ పాలనలో ఆలయంలో పూజలు జరుగుతుండేవని, అనంతరం పూర్తిగా శిథిలమై ధూపదీపాలకు స్వామి నోచుకోలేదని పెద్దలు చెబుతున్నారు.

2009లో పునరుద్ధరణకు శ్రీకారం

2006లో ఆత్మకూరు గ్రామస్తులే కొందరు శిథిలావస్థకు చేరిన అలఘునాథ స్వామి ఆలయాన్ని పరిశుభ్రం చేసి పూజలు నిర్వహిస్తుండేవారు. 2009లో అప్పటి ఉమ్మడి రాష్ట్ర పురావస్తు శాఖ దృష్టికి వెళ్లడంతో ఆలయ పునరుద్ధరణకు శ్రీకారం చుట్టారు. పురావస్తు శాఖ నిధులకు తోడు పలువురు దాతల సహకారంతో సుమారు కోటి రూపాయలు వెచ్చించి 2013లో ఆలయాన్ని పునరుద్ధరించారు. 2013 ఆగస్టులో ఆలయ పునః ప్రతిష్ఠ ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. శ్రీశక్తి పీఠాధిపతి పరిపూర్ణానంద స్వామి, రామానుజ చిన్నజీయర్‌స్వామి వార్ల సువర్ణ హస్తాల మీదుగా ఆలయాన్ని పునఃప్రారంభించారు. నాటి నుంచి అలఘునాథునికి నిత్యం విశేష పూజలు నిర్వహిస్తున్నారు.

మూడ్రోజుల పాటు ఉత్సవాలు

అలఘునాథుని ఆలయం పునఃప్రతిష్ఠ జరుపుకొని పుష్కర కాలం పూర్తయిన సందర్భంగా పుష్కర కుంభాభిషేక మహోత్సవాలను మంగళవారం నుంచి మూడ్రోజుల పాటు వైభవంగా నిర్వహించనున్నారు. తొలి రోజు మంగళవారం ఉదయం కలశ స్థాపన, విశ్వక్సేన పూజ, యాగశాల పూజలు నిర్వహించనున్నారు. సాయంత్రం ప్రదోషకాల పూజలు, సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం చేయనున్నారు. బుధవారం ప్రాతఃకాల పూజలు, పుణ్యాహావచనం, అరుణ పారాయణం, సుదర్శన హోమం నిర్వహించనున్నారు. గురువారం ప్రాతఃకాల పూజలు, పూర్ణాహుతి హోమం, ఆలయ గర్భాలయంపై మహాకుంభాభిషేకం, స్వామి, అమ్మవార్ల కల్యాణం వైభవంగా నిర్వహించనున్నారు. మధ్యాహ్నం భారీస్థాయిలో అన్నప్రసాద వితరణ, సాయంత్రం గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఊటచెరువులో హెచ్చరిక బోర్డు



సోమశిల: అనంతసాగరం మండలం దేవరాయపల్లి బిట్–1 పంచాయతీ పరిధిలోని ముత్తుకూరు గ్రామంలో ఉన్న ఊట చెరువు వద్ద రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డును సోమవారం ఏర్పాటు చేశారు. ఇటీవల చెరువును పలువురు ఆక్రమిస్తున్నారని గ్రామస్తులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు జేసీ కార్తీక్, ఆత్మకూరు ఆర్డీఓ పావని చెరువును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వివాదాస్పద చెరువు భూముల్లోకి ఎవరూ దిగకుండా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ జయవర్ధన్‌ను ఆదేశించారు. ఈ మేరకు తహసీల్దార్ జయవర్ధన్ వీఆర్‌ఏలు రామయ్య, చిన్నయ్యను పంపి హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేయించారు. చెరువు భూముల్లోకి ఎవరైనా దిగితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

డీసీపల్లిలో 330 పొగాకు బేళ్ల విక్రయం

మర్రిపాడు: డీసీపల్లి పొగాకు వేలం కేంద్రంలో సోమవారం 330 బేళ్లను విక్రయించినట్లు వేలం నిర్వహణాధికారి జీ రాజశేఖర్ తెలిపారు. వేలానికి 476 బేళ్లు రాగా, 330 బేళ్లను విక్రయించామని చెప్పారు. వేలంలో కిలో పొగాకు గరిష్ఠంగా రూ.280, కనిష్ఠంగా రూ.159, సగటున రూ.237.30 ధర పలికిందని వివరించారు. వేలంలో 11 కంపెనీలకు చెందిన వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యార్థినులు అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న సీఐ వేమారెడ్డి

చేజర్ల(సోమశిల): సమాజంలో జరుగుతున్న నేరాలపై విద్యార్థినులు అవగాహన కలిగి అప్రమత్తంగా ఉండాలని సంగం సీఐ వేమారెడ్డి సూచించారు. చేజర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని విద్యార్థినులకు సైబర్ నేరాలు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కార్యక్రమాన్ని ఇన్‌చార్జి ప్రిన్సిపల్ సాలెమ్మ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ వేమారెడ్డి మాట్లాడుతూ సమాజంలో బాలికలపై జరుగుతున్న దాడులు, నేరాలపై అవగాహన కల్పించారు. బాలికల అత్యవసర పరిస్థితుల్లో 112, 181 నంబర్లకు ఫోన్ చేస్తే వెంటనే పోలీసులు రక్షణ కల్పిస్తారని తెలిపారు. ప్రేమ ఆకర్షణకు లోను కాకుండా కష్టపడి చదివి ఉన్నతస్థాయికి ఎదిగి తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీల నిరసన



నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

సోమశిల: పనిభారాన్ని తగ్గించాలని కోరుతూ అంగన్‌వాడీలు సీఐటీయూ ఆధ్వర్యంలో అనంతసాగరం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం ఎదుట సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ప్రభుత్వం ఇచ్చిన 2జీ సెల్‌ఫోన్లలో యాప్‌లు పనిచేయడం లేదన్నారు. ఈ కారణంగా ఆన్‌లైన్‌లో డేటా ఎంట్రీ చేయడం కష్టంగా మారిందన్నారు. సకాలంలో డేటా ఆన్‌లైన్ చేయకపోతే మెమోలు అందుకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి 5జీ ఫోన్లు అందజేసి పనిభారాన్ని తగ్గించాలని కోరారు. అనంతరం 2జీ సెల్‌ఫోన్లను ప్రాజెక్ట్ కార్యాలయంలో అందజేశారు. అనంతసాగరం, మర్రిపాడు మండలాల సీఐటీయూ కార్యదర్శులు షేక్ అన్వర్‌బాషా, బత్తల రత్నయ్య, అంగన్‌వాడీ లీడర్లు సునీత, సుబ్బమ్మ, నాగమణి, లక్ష్మి, పద్మ, అరుణ, సుజాత, జయసుధ, సులోచన, ఆదిలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల విలీనాన్ని వ్యతిరేకిస్తూ ఆందోళన



తహసీల్దార్ కార్యాలయం ఎదుట విద్యార్థులతో కలిసి ఆందోళన చేపడుతున్న తల్లిదండ్రులు

సంగం: దువ్వూరు తూర్పు హరిజనవాడ పాఠశాల విలీనాన్ని వ్యతిరేకిస్తూ విద్యార్థులు, తల్లిదండ్రులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం ఆందోళన చేపట్టారు. అనంతరం తహసీల్దార్ సోమ్లానాయక్‌కు వినతిపత్రం అందజేశారు. సుదూరంగా ఉండే పాఠశాలలో విలీనం చేయడం వల్ల పిల్లలు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులకు గురవుతారని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన తహసీల్దార్ విద్యాశాఖ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

డీఆర్వోలకు పదోన్నతి





ఎఫ్‌ఆర్వోలుగా పదోన్నతి పొందిన పిచ్చిరెడ్డి, ఖాజారహంతుల్లా

ఆత్మకూరు: ఆత్మకూరు ఫారెస్ట్ డివిజన్ పరిధిలో డిప్యూటీ రేంజ్ అధికారులుగా పనిచేస్తున్న ఇద్దరికి ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్లుగా పదోన్నతి లభించింది. ప్రభుత్వం ఏఎస్‌పేట, మర్రిపాడు డీఆర్వోలుగా విధులు నిర్వహిస్తున్న ఎస్ పిచ్చిరెడ్డి, ఎస్‌కే ఖాజారహంతుల్లాకు ఎఫ్‌ఆర్వోలుగా పదోన్నతి కల్పిస్తూ ప్రకాశం జిల్లాకు బదిలీ చేసినట్లు ఆ శాఖ ఉన్నతాధికారులు సోమవారం తెలిపారు. కాగా పదోన్నతి పొందిన వారిని అటవీ శాఖ అధికారులు, సిబ్బంది అభినందించారు.

నేడు తాగునీటి సరఫరాకు అంతరాయం

ఆత్మకూరు: వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ నిర్వహణ దృష్ట్యా మున్సిపల్ పరిధిలోని పలు వార్డుల్లో తాగునీటి సరఫరాను మంగళవారం నిలిపివేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ సీ గంగాప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 4, 5, 6, 7, 8, 9, 10, 11, 13, 15, 16, 17, 18 వార్డుల పరిధిలో తాగునీటి సరఫరా ఉండదని వివరించారు. బుధవారం యథావిధిగా విడుదల చేస్తామన్నారు. పట్టణ ప్రజలు సహకరించాలని కోరారు.

మాధవ్ పర్యటనను జయప్రదం చేయాలి



సంగం: బీజేపీ రాష్ట్రాధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ఈ నెల 13న నెల్లూరుకు రానున్నారని, ఆయన పర్యటనను జయప్రదం చేయాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు బత్తల కృష్ణయ్య పిలుపునిచ్చారు. సంగంలోని ఇరిగేషన్ అతిథిగృహంలో సంగం, చేజర్ల, ఏఎస్‌పేట మండలాల బీజేపీ నాయకులతో సోమవారం ఆయన సమావేశం నిర్వహించారు. పార్టీ బలోపేతంపై చర్చించారు. రాబోయే రోజుల్లో కార్యకర్తల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. మండలాల అధ్యక్షులు మనోహర్‌రెడ్డి, చెంచులురెడ్డి, అంజయ్య, నర్సారెడ్డి పాల్గొన్నారు.

పిచ్చికుక్క స్వైరవిహారం

మర్రిపాడు: మండలంలోని పడమటినాయుడుపల్లిలో సోమవారం పిచ్చికుక్క స్వైరవిహారం చేసింది. పది పశువులపై దాడి చేసి గాయపరిచింది. రైతుల నుంచి సమాచారం అందుకున్న పశుసంవర్థక శాఖ ఏడీ డాక్టర్ ఎస్ జయచంద్ర సంచార పశు వైద్య వాహన సిబ్బంది, వీపీఏ లక్ష్మిరెడ్డితో కలిసి యాంటీ రేబిస్ టీకాలు వేశారు.

ప్రజాసమస్యల పరిష్కార వేదికపై నిర్లక్ష్యం



అన్ని శాఖల అధికారులు హాజరుకాక ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

ఆత్మకూరురూరల్: మండల తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం అధికారుల నిర్లక్ష్యానికి పరాకాష్ఠగా నిలిచింది. ఉదయం10 గంటలకు తహసీల్దార్ పద్మజాకుమారి, డిప్యూటీ తహసీల్దార్ స్వరూప్ మాత్రమే హాజరయ్యారు. ఆ తరువాత 11.05 గంటలకు ఎంఈఓ–2 చలపతి, వ్యవసాయాధికారి కిషోర్‌బాబు వచ్చారు. 11.30 గంటలకు ఎంపీడీఓ రఫీఖాన్, తదితరులు హాజరయ్యారు. అప్పటికే అధికారుల కోసం వేచి ఉన్న కార్యార్థులు ప్రజాసమస్యల పరిష్కార వేదికపై నిర్లక్ష్యం వహించడం సబబు కాదని అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు.

కలిగిరిలో మోస్తరు వర్షం

కలిగిరి: మండలంలో సోమవారం మోస్తరు వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండవేడిమి, ఉక్కపోతతో ప్రజలు అల్లాడిపోయారు. మధ్యాహ్నం నుంచి వాతావరణంలో మార్పులు చోటు చేసుకుని ఆకాశం మేఘావృతమై ఉరుములు, మెరుపులతో వర్షం కురిసి వాతావరణం చల్లబడడంతో ప్రజలు కాస్త సేదతీరారు. కాగా పదును వాన కురవడంతో దుక్కులు దున్ని వ్యవసాయ పనులు మొదలు పెట్టవచ్చునని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

ఉదయగిరి రూరల్: కొండాయపాళెంలో 104 సేవలను సోమవారం అందజేశారు. వైద్యాధికారిణి శివకల్పన 58 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. సీజనల్ వ్యాధులపై అవగా హన కల్పించారు.

తల్లిపాలు అమృత తుల్యం



అల్లూరు: అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ పద్మావతి



ఉదయగిరిరూరల్‌లో పోషకాహార ప్రదర్శన

సంగం: తల్లిపాలు అమృతంతో సమానమని ఐసీడీఎస్ ఆత్మకూరు ప్రాజెక్ట్ సీడీపీఓ సునీలత అన్నారు. సంగంలోని నిమ్మతోపు సెంటర్ అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల్లో ఆమె పాల్గొన్నారు. తల్లిపాల విశిష్టతపై అవగాహన కల్పించారు. తల్లిపాలలో రోగ నిరోధక శక్తి పుష్కలంగా ఉంటుందని తెలిపారు. బిడ్డ పుట్టిన గంటలోపు తల్లిపాలు ముర్రుపాలు పడితే వ్యాధులు దరిచేరవని వివరించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

ఉదయగిరి రూరల్: మండలంలోని దేకూరుపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. అంగన్‌వాడీలు బిడ్డకు తల్లిపాల ఆవశ్యకతపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. అనంతరం పోషకాహారాన్ని ప్రదర్శించారు.

వరికుంటపాడు: మండలంలోని తూర్పురొంపిదొడ్ల మెయిన్ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. అంగన్‌వాడీలు పద్మావతి, చిన్నమ్మ, మరియమ్మ తల్లిపాల విశిష్టతను వివరించారు. ఏఎన్‌ఎం స్టెల్లా, ఆశా కార్యకర్త సరస్వతి పాల్గొన్నారు.

అల్లూరు: మండలంలోని అల్లూరుపేట అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల్లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వీ పద్మావతి పాల్గొన్నారు. బిడ్డకు తల్లిపాల అవశ్యకతపై అవగాహన కల్పించారు. ఏఎన్‌ఎం దొరసానమ్మ, ఆశావర్కర్ కే మౌనిక, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.



వరికుంటపాడు: గర్భిణులకు అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీలు



సంగంలో అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ సునీలత

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం

అనుమసముద్రంపేట త్రైత సిద్ధాత ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞానవేదిక పాదలకూరు కమిటీ ఆధ్వర్యంలో మండలంలోని పానుగోడు, తాతిరెడ్డిపల్లి, రాజవోలు, పమిడిపాడు, తదితర గ్రామాల్లో త్రైత సిద్ధాంత భగవద్గీతపై సోమవారం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 16న కృష్ణాష్టమి సందర్భంగా శ్రీకృష్ణ భగవానుడిని ఊరేగిస్తే ప్రకృతి వైపరీత్యాలు, రోగ బాధలు ఉండవని తెలిపారు. ఇందూ జ్ఞానవేదిక పాదలకూరు కమిటీ అధ్యక్షుడు జీ పెంచల నరసయ్య, సభ్యులు బీ కృష్ణయ్య, ఈ పద్మమ్మ, శేషాద్రి, టి నరసారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మొక్కుబడిగా పొలం పిలుస్తోంది

- అధికారుల్లో కనిపించని శ్రద్ధ
- ఆసక్తి చూపని అన్నదాతలు
- ఫొటోలకే పరిమితం



పొలం పిలుస్తోంది కార్యక్రమానికి ఇద్దరే అధికారులు హాజరైన దృశ్యం

దుత్తలూరు: ఉదయగిరి నియోజకవర్గంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మొక్కుబడిగా సాగుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం రైతులకు పంటల సాగు సూచనలు, సలహాలు అందించడం ద్వారా వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చాలని పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చెబుతున్న ఈ కార్యక్రమంపై క్షేత్రస్థాయిలో అధికారులు శ్రద్ధ చూపడం లేదు. ఆధునిక వ్యయసాయ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించడం ద్వారా ఆదాయాన్ని గణనీయంగా పెంచాల్సిన అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. దీంతో రైతుల నుంచి స్పందన కరవవుతోంది. వ్యవసాయ, ఉద్యాన, పట్టు, పశుసంవర్థక, ఆత్మ, తదితర శాఖల అధికారులు పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొనాలి. నిర్దేశించిన గ్రామంలో ఉదయం 8.30 నుంచి 10 గంటల వరకు క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించాలి. అనంతరం 12 గంటల వరకు వ్యవసాయ నిపుణులు, శాస్త్రవేత్తలు రైతులతో ముఖాముఖి నిర్వహించాలి. మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు మరోగ్రామంలో క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించాలి. ఆ తర్వాత 5.30 గంటలకు అన్నదాతలతో సమావేశమై వారి సందేహాలను నివృత్తి చేయాలి. సంక్షేమ పథకాలు, ఎరువులు, విత్తనాలు, అధిక దిగుబడులపై రైతులను చైతన్య పరచాలి. అయితే ప్రతి మండలంలో కనీసం రెండు మూడు శాఖల అధికారులు కూడా ఈ కార్యక్రమానికి హాజరుకావడం లేదు. వ్యవసాయ అనుబంధ శాఖలకు సంబంధించి అధికారులు కాదు కదా కనీసం క్షేత్రస్థాయి సిబ్బంది కూడా పాల్గొనకుండానే కార్యక్రమాన్ని మమ అనిపిస్తున్నారు. దీంతో అన్నదాతలకు సరైన సూచనలు, సలహాలు అందడం లేదు.

కూటమి ప్రభుత్వం వచ్చాక..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతి రైతుభరోసా కేంద్రం పరిధిలో ఈ కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేవారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ కార్యక్రమంపై నిర్లక్ష్యం వహిస్తోందని పలువురు విమర్శిస్తున్నారు. ఉదయగిరి నియోజకవర్గంలో 93 రైతు సేవా కేంద్రాలున్నాయి. ఆయా కేంద్రాల పరిధిలో వారానికి రెండు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించాలి. అయితే అధికారుల నిర్లక్ష్యంతో ఆయా కార్యక్రమాలకు పట్టుమని పది మంది కూడా రైతులు హాజరుకావడం లేదు. రైతులు లేకుండానే ప్రదర్శన క్షేత్రాలు నిర్వహిస్తున్నట్లు అధికారులు రికార్డుల్లో రాసుకుంటున్నారే తప్ప ఆచరణలో రైతులకు ఏమీ ఒనగూరడం లేదు.

నిర్వహణకు నిధులు ఇలా..

పొలం పిలుస్తోంది కార్యక్రమానికి సంబంధించి ఒకరోజు సమావేశం నిర్వహణకు రూ.1500, ఫ్లెక్సీ తయారీకి రూ.150, మైకులు, స్నాక్స్‌కు సంబంధించి రూ.1000, మండలానికి కరపత్రాల ముద్రణకు రూ.5 వేలు చొప్పున ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తోంది. ఇంత ఖర్చు పెడుతున్నా రైతులకు ఉపయోగపడేలా కార్యక్రమాలు నిర్వహించడం లేదని వారు ఆరోపిస్తున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని రైతులకు ప్రయోజనం చేకూరేలా నిర్వహించాలని వారు కోరుతున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం

ప్రతి మంగళ, బుధవారాల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని బాగా నిర్వహిస్తున్నాం. ఈ కార్యక్రమానికి వ్యవసాయాధికారులు, వ్యవసాయ సిబ్బంది హాజరవుతున్నారు. ఇతర శాఖల అధికారులు హాజరుకావాలనే నిబంధన ఏమీ లేదు.ఆయా ప్రాంతాల్లో పంటలను బట్టి ఇతర శాఖల అధికారులు హాజరవుతారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్‌లో పంటల సాగు తక్కువగా ఉంది.

–లక్ష్మీమాధవి, ఏడీఏ, ఉదయగిరి